

## ఎలిమినేట్ ఎవరో?

అహ్మదాబాద్: ఐపీఎల్‌లో మరో కీలక పోరుకు రంగం సిద్ధమైంది. బుధవారం నరేంద్రమోదీ స్టేడియం వేదికగా రాయల్‌చాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్ మధ్య కీలకమైన ఎలిమినేటర్ పోరు జరుగనుంది. ఆశలు లేని స్థితి నుంచి వరుసగా ఆరు విజయాలతో బెంళూరు ప్లేఆఫ్స్‌కు దూసుకొస్తే..ప్రథమార్ధంలో వరుసగా గెలిచిన రాయల్స్..ఆ తర్వాత ఓటములతో టాప్-4లో నిలిచింది.కోహ్లీ సూపర్‌ఫామ్ మీద ఉండటం ఆర్‌సీబీకి కలిసిరానుంది. మరోవైపు రాజస్థాన్ మూడో స్థానంతో ప్లేఆఫ్స్‌లోకి ప్రవేశించింది. ఓడిన జట్టు ఇంటిముఖం పట్టనుండగా, గెలిచిన టీమ్ క్వాలిఫయర్-2లో హైదరాబాద్‌తో తలపడుతుంది.

## రెండో రౌండ్‌కు త్రిసా-గాయత్రి జోడీ

కౌలాలంపూర్: మలేషియా మాస్టర్స్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత మహిళల జోడీ త్రిసా జాలీ-గాయత్రి గోపీచంద్ రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. మంగళవారం జరిగిన మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో ఏడో సీడ్ భారత జంట 21-14, 21-10 తేడాతో హువాంగ్-లియాంగ్ (చైనీస్ తైపీ)పై గెలిచింది. మరో డబుల్స్ పోరులో పాలక్ , ఉన్నతి హుడా 10-21, 5-21తో చైనీస్ హు యిన్-లియన్ జి యున్ చేతిలో ఓడారు.

## మళ్లీ నంబర్‌వన్‌లో సాత్విక్ జంట

ఢిల్లీ: ఈ ఏడాది నిలకడైన ప్రదర్శనలతో సత్తా చాటుతున్న భారత స్టార్ ద్వయం సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ (బీడబ్ల్యూఎఫ్) పురుషుల ర్యాంకింగ్స్‌లో మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌కు చేరుకుంది. ఇటీవలే ముగిసిన థాయ్‌లాండ్ ఓపెన్‌కు ముందు మూడో స్థానంలో ఉన్న ఈ జోడీ..ఆ టోర్నీలో టైటిల్ గెలవడంతో అగ్రస్థానం కైవసం చేసుకుంది. 99,670 పాయింట్లతో భారత జోడీ టాప్‌లో ఉండగా చైనా జోడీ వి కెంగ్, వాంగ్ చెంగ్ రెండో స్థానంలో ఉన్నారు.

# ఫైనల్లో కేకేఆర్

**క్వాలిఫయర్-1లో చేతులెత్తేసిన సన్‌రైజర్స్ ● మిచెల్ స్టార్క్ పేస్‌కు విలవిల**

**ఎస్‌ఆర్‌హెచ్‌ను ఆదుకున్న త్రిపాఠి ● లక్ష్యాన్ని ఊదేసిన వెంకటేశ్, శ్రేయస్**

**ఐపీఎల్ -17 ఆరంభం నుంచి నిలకడగా రాణిస్తోన్న కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) మూడేండ్ల తర్వాత మళ్లీ ఈ లీగ్ ఫైనల్స్‌లో అడుగుపెట్టింది. మంగళవారం అహ్మదాబాద్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్)ను చిత్తుగా ఓడించిన కేకేఆర్..లీగ్‌లో నాలుగోసారి ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. సీజన్‌లో అంతగా ప్రభావం చూపని రూ.24.75 కోట్ల స్టార్క్.. కీలక సమయంలో జూలు విదిల్చి తన అమ్ములపొదిలో ఉన్న అస్త్రాలను సంధించడంతో హైదరాబాద్ కథ ఆదిలోనే ముగిసింది. త్రిపాఠి, క్లాసెన్ ఆదుకున్నా కేకేఆర్ బౌలర్లు సమిష్టిగా రాణించిన పిచ్‌పై మన బౌలింగ్ దళం దారుణంగా తేలిపోయింది. ఒత్తిడిలో చిత్తైన సన్‌రైజర్స్.. రెండో క్వాలిఫయర్‌లో నేడు జరిగే 'ఎలిమినేటర్ మ్యాచ్ విజేత'తో పోటీ పడుతుంది.**



స్టార్క్ (3/34)



శ్రేయస్ (58*)

వెంకటేశ్ (51*)

అహ్మదాబాద్: ఐపీఎల్-17లో సమిష్టి ప్రదర్శనతో ప్రత్యర్థి జట్లకు ముచ్చెమటలు పట్టిస్తున్న కోల్‌కతా నైట్ రైడర్స్.. క్వాలిఫయర్-1లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై అఖండ విజయంతో ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. మంగళవారం నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఎస్‌ఆర్‌హెచ్‌పై 8 వికెట్ల తేడాతో భారీ విజయాన్ని నమోదుచేసింది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' మిచెల్ స్టార్క్ (3/34), వరుణ్ చక్రవర్తి (2/26)తో పాటు కేకేఆర్ బౌలర్లు సమిష్టిగా రాణించడంతో మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్.. 19.3 ఓవర్లలో 159 పరుగులకే ఆలౌట్ అయింది. రాహుల్ త్రిపాఠి (35 బంతుల్లో 55, 7 ఫోర్లు, 1 సిక్సర్) టాప్ స్కోరర్. భారీ హిట్టర్లు ఉన్న కోల్‌కతా ఈ లక్ష్యాన్ని 13.4 ఓవర్లలోనే 2 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. 'అయ్యర్' ద్వయం వెంకటేశ్ (28 బంతుల్లో 51 నాటౌట్, 5 ఫోర్లు, 4 సిక్సర్లు), శ్రేయస్ (24 బంతుల్లో 58 నాటౌట్, 5 ఫోర్లు, 4 సిక్సర్లు) లక్ష్యాన్ని ఊదిపారేశారు.

### త్రిపాఠి ఒక్కడే..

ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ తమ ఓపెనర్ల మీద ఎంతలా ఆధారపడిందో కోల్‌కతాతో మ్యాచ్ ద్వారా మరోసారి నిరూపితమైంది. కేకేఆర్ స్టార్ పేసర్ స్టార్క్, వైభవ్ అరోరా ఆరంభంలోనే హైదరాబాద్‌ను దెబ్బకొట్టి కోలుకోనీయకుండా చేశారు. పంజాబ్‌తో గత మ్యాచ్‌లో మాదిరిగానే స్టార్క్ తొలి ఓవర్లో రెండో బంతికే ట్రావిస్ హెడ్‌ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. రెండో ఓవర్లో అరోరా బౌలింగ్‌లో.. అభిషేక్ శర్మ (3) క్యాచ్‌ను రస్సెల్ పట్టడంతో నిష్క్రమించాడు. స్టార్క్ ఐదో ఓవర్లో వరుస బంతుల్లో నితీశ్ రెడ్డి (9), షాబాజ్‌ను ఔట్ చేసి మరోసారి దెబ్బకొట్టాడు. ఈ క్రమంలో రాహుల్ త్రిపాఠితో జతకలిసిన క్లాసెన్ (21 బంతుల్లో 32, 3 ఫోర్లు, 1 సిక్స్) .. సన్‌రైజర్స్‌ను ఆదుకున్నాడు. ఈ ఇద్దరూ ధాటిగా ఆడటంతో ఎస్‌ఆర్‌హెచ్ స్కోరుబోర్డు వేగం పుంజుకుంది. వికెట్‌ను కాపాడుకుంటూనే వీలుచిక్కినప్పుడల్లా బంతిని స్టాండ్స్‌లోకి పంపిన త్రిపాఠి.. 29 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేశాడు. కానీ బౌలింగ్ మార్పుగా వచ్చిన వరుణ్ చక్రవర్తి.. 11వ ఓవర్లో క్లాసెన్‌ను ఔట్ చేయడంతో ఎస్‌ఆర్‌హెచ్ పరిస్థితి మూలిగే నక్కమీద తాటిపండు పడ్డ చందంగా అయింది. నరైన్ 14వ ఓవర్లో అబ్దుల్ సమద్ (16)తో సమన్వయ లోపం కారణంగా త్రిపాఠి రనౌట్ అవడంతో పాటు సన్వీర్ సింగ్ డకౌట్ అయ్యాడు. ఆఖర్లో సారథి పాట్ కమిన్స్ (24 బంతుల్లో 30, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) మెరుపులతో హైదరాబాద్ గౌరవప్రదమైన స్కోరుచేసింది.

### కేకేఆర్ అలవోకగా..

స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన కోల్‌కతా.. ఆది నుంచే హిట్టింగ్‌కు దిగింది. పవర్ ప్లేలో రెహ్మానుల్లా గుర్బాజ్ (14 బంతుల్లో 23, 2 ఫోర్లు, 2 సిక్సర్లు), సునీల్ నరైన్ (16 బంతుల్లో 21, 4 ఫోర్లు) మెరుపు ఆరంభాన్నిచ్చారు. ఈ ఇద్దరూ నిష్క్రమించినా వారి స్థానాల్లో వచ్చిన వెంకటేశ్ అయ్యర్, సారథి శ్రేయస్ అయ్యర్ దూకుడుగా ఆడారు. ఎదుర్కొన్న తొలి బంతికే బౌండరీతో పరుగుల ఖాతా తెరిచిన వెంకటేశ్.. భువీ, కమిన్స్ బౌలింగ్‌లో భారీ షాట్లు ఆడాడు. ఈ ఇద్దరూ బాదుతున్నా కమిన్స్ బౌలర్లను మార్చకపోవడంతో ఈ జోడీ స్వేచ్ఛగా ఆడి అర్ధ శతకాలతో పాటు మ్యాచ్‌నూ ముగించింది. పది ఓవర్లలోనే వంద పరుగుల మార్కును దాటిన కోల్‌కతా.. మరో 6.2 ఓవర్లు మిగిలుండగానే గెలిచి ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. ఐపీఎల్ ఫైనల్స్‌లో ఆడటం కేకేఆర్‌కు ఇది నాలుగో సారి కావడం విశేషం.

### సంక్షిప్త స్కోర్లు

**హైదరాబాద్:** 19.3 ఓవర్లలో 159 ఆలౌట్ (త్రిపాఠి 55, క్లాసెన్ 32, స్టార్క్ 3/34, చక్రవర్తి 2/26). **కోల్‌కతా:** 13.4 ఓవర్లలో 164/2 (శ్రేయస్ 58 నాటౌట్, వెంకటేశ్ 51 నాటౌట్, నటరాజన్ 1/22, కమిన్స్ 1/38)

# భారత్ పసిడి జోరు

● **వరల్డ్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్**



కోబ్: ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్లు దేశానికి పసిడి పతకాల పంట పండిస్తున్నారు. కోబ్ (జపాన్) వేదికగా జరుగుతున్న ఈ మెగా టోర్నీలో మంగళవారం భారత్‌కు మూడు స్వర్ణాలు, ఓ రజతం, కాంస్యం దక్కాయి. భారత్‌కు హైజంప్, జావెలిన్ త్రో, క్లబ్ త్రో ఈవెంట్స్‌లో పతకాలు లభించాయి. పురుషుల హైజంప్ టీ63 కేటగిరీలో తంగవేలు మరియప్ప.. 1.88 మీటర్లు దూకి పసిడి ఒడిసిపట్టాడు. యూఎస్‌ఏ అథ్లెట్లు ఎజ్రా ఫ్రెచ్ (1.85 మీటర్లు), సామ్ గ్రీవ్ (1.82 మీటర్లు) వరుసగా రజతం, కాంస్యం గెలుచుకున్నారు. పురుషుల జావెలిన్ త్రో ఎఫ్ 64 విభాగంలో సుమిత్ అంటిల్.. బరిసెను 68.17 మీటర్ల దూరం విసిరి గోల్డ్ మెడల్ సొంతం చేసుకున్నాడు. దులన్ కొడితువక్కు (శ్రీలంక) రజతం నెగ్గగా భారత్‌కే చెందిన సందీప్ (60.41 మీటర్లు) కాంస్యం సాధించాడు. మహిళల క్లబ్ త్రో ఎఫ్51లో ఏక్తా బైయాన్.. 20.12 మీటర్ల త్రో తో బంగారు పతకాన్ని కైవసం చేసుకోగా 14.56 మీటర్లతో కాశిశ్ లక్రా రజతం గెలుచుకుంది. ఈ టోర్నీలో సోమవారం తెలంగాణ అమ్మాయి దీప్తి జివాంజి స్వర్ణం గెలిచిన విషయం తెలిసిందే.

# రెజ్లర్లకు ఊరట

**ట్రయల్స్ నిర్వహించబోమన్న డబ్ల్యూఎఫ్ఐ**



ఢిల్లీ: ఇటీవలే ముగిసిన బిష్కెక్, ఇస్తాంబుల్ అర్హత టోర్నీలలో సత్తా చాటి పారిస్ ఒలింపిక్స్ బెర్తులు ఖాయం చేసుకున్న ఆరుగురు రెజ్లర్లకు భారీ ఊరట దక్కింది. ఈ రెజ్లర్ల కేటగిరీలలో మళ్లీ ట్రయల్స్ నిర్వహించబోమని భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మంగళవారం కీలక నిర్ణయం తీసుకుంది. ఏడుగురు సభ్యులతో కూడిన సెలక్షన్ కమిటీ.. ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు సంజయ్ సింగ్ తెలిపాడు. ట్రయల్స్ వల్ల రెజ్లర్లు ఒకవేళ గాయాల బారిన పడితే అది మొదటికే మోసం వచ్చే ప్రమాదం ఉండటంతో ఆ ప్రయత్నాలను డబ్ల్యూఎఫ్ఐ విరమించుకుంది. అయితే ఈ నిర్ణయం పట్ల ఓ సీనియర్ రెజ్లర్ కోర్టుకు వెళ్లే అవకాశమున్నట్టు సమచారం. పారిస్ టికెట్ ఖాయం చేసుకున్న రెజ్లర్లలో వినేశ్ ఫోగట్ (50 కిలోలు), అంతిమ్ పంఘల్ (53 కిలోలు), అన్షు మాలిక్ (57 కిలోలు), నిషా దహియా (68 కిలోలు), రితికా హుడా (76 కిలోలు), అమన్ సెహ్రావత్ (57 కిలోలు) ఉన్నారు. ఒలింపిక్స్ ముందు మళ్లీ ట్రయల్స్ నిర్వహణ వద్దని వీరంతా డబ్ల్యూఎఫ్ఐకి ఇటీవలే లేఖ రాసిన విషయం విదితమే.

# రజతంతో సరి



బ్యాంకాక్: ఏషియన్ రిలే చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల, మహిళల 4X400 మీటర్ల రిలే జట్లు రజతంతో సరిపెట్టుకున్నాయి. బ్యాంకాక్ వేదికగా మంగళవారం జరిగిన రిలేలో మహ్మద్ అనాస్, సంతోష్ కుమార్, మిజో చాకో, అరోకియా రాజీవ్‌తో కూడిన పురుషుల జట్టు.. 3 నిమిషాల 05.76 సెకన్లల్లో గమ్యాన్ని పూర్తిచేసి రెండో స్థానంలో నిలిచింది. శ్రీలంక బృందం (3:04.48) స్వర్ణం గెలుచుకోగా వియత్నాం (3:07.37) కాంస్యం నెగ్గింది. విథ్యా రామ్‌రాజ్, పూవమ్మ, రూపల్, ప్రాచి చౌదరితో కూడిన మహిళల బృందం.. 3 నిమిషాల 33.55 సెకన్లతో రజతం గెలవగా వియత్నాం (3:30.81), జపాన్ (3:36.56) వరుసగా స్వర్ణ, కాంస్య పతకాలు గెలుచుకున్నాయి.

---

**వాణిజ్యం**

# బీఎస్‌ఈ మార్కెట్ క్యాప్ @ 5 ట్రిలియన్ డాలర్లు

**చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకున్న కంపెనీల విలువ**

ముంబై, మే 21: బీఎస్‌ఈలో లిస్టైన సంస్థల మార్కెట్ విలువ రికార్డు స్థాయిలో దూసుకుపోయింది. మంగళవారం బీఎస్‌ఈలో లిస్టైన కంపెనీల విలువ 5 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నది. మార్కెట్ క్యాప్ ఇంతటి గరిష్ఠ స్థాయికి చేరుకోవడం దేశీయ చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం. ఇంట్రాడేలో 5.1 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్న బీఎస్‌ఈలోని సంస్థల విలువ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి రూ.4,14,62,306.56 కోట్లు(4.97 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ స్టాక్‌లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుతోనే గడిచిన ఐదు నెలల్లోనే బీఎస్‌ఈ మార్కెట్ క్యాప్ 633 బిలియన్ డాలర్లు పెరిగింది. ఈ ఏడాది ప్రారంభంలో 4.14 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న మార్కెట్ విలువ ప్రస్తుతం 5 లక్షల కోట్ల డాలర్లు అధిగమించింది. 2024 ప్రారంభం నుంచి ఇప్పటి వరకు సెన్సెక్స్ 2.3 శాతం రిటర్నులు పంచింది. కానీ బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ 16 వాతం పంచగా, బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ 11 శాతం రిటర్నులు పంచింది. కేవలం ఆరు నెలల్లోనే 4 ట్రిలియన్ డాలర్ల నుంచి 5 ట్రిలియన్ డాలర్లకు ఎగబాకింది. నవంబర్ 29, 2023లో 4 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్న విషయం తెలిసిందే. మరోవైపు దేశీయ స్టాక్ మార్కెట్లు స్వల్పంగా నష్టపోయాయి. 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 52.63 పాయింట్లు నష్టపోయి 74 వేల పాయింట్ల దిగువకు 73,953.31 వద్ద ముగిశాయి.

- ***మే 24, 2021లో బీఎస్‌ఈ మార్కెట్ క్యాప్ 3 ట్రిలియన్ డాలర్ల మార్క్‌ను అధిగమించింది.***
- ***మే 28, 2007లో ట్రిలియన్ డాలర్ల మార్కెట్ క్యాప్‌కు చేరుకున్నది. 1 ట్రిలియన్ డాలర్ల నుంచి 1.5 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవడానికి 2,566 రోజులు లేదా ఏడేండ్లు పట్టింది.***
- ***జూలై 10, 2017న 2 ట్రిలియన్ డాలర్లు అధిగమించింది. 1.5 ట్రిలియన్ డాలర్ల నుంచి 2 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవడానికి 1,130 రోజులు పట్టింది.***
- ***ఈ ఏడాదిలో ఇప్పటి వరకు బీఎస్‌ఈ సెన్సెక్స్ 1,713 పాయింట్లు లేదా 2.37 శాతం పెరిగింది. చారిత్రక గరిష్ఠ స్థాయి ఏప్రిల్ 9న 75,124.28 పాయింట్లకు చేరుకున్నది.***

**స్టాక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ (డాలర్లలో)**

| | |
|---|---|
| అమెరికా | 55 ట్రిలియన్ |
| చైనా | 9.4 ట్రిలియన్ |
| జపాన్ | 6.4 ట్రిలియన్ |
| హాంకాంగ్ | 5.4 ట్రిలియన్ |
| **భారత్** | **5.1 ట్రిలియన్** |



# రికార్డుల నుంచి పసిడి వెనక్కి

న్యూఢిల్లీ, మే 21: రికార్డు స్థాయిలో దూసుకుపోయిన బంగారం ధరలు కాస్త శాంతించాయి. అంతర్జాతీయ మార్కెట్లో అనూహ్యంగా అతి విలువైన లోహాల ధరలు తగ్గుముఖం పట్టడం, భవిష్యత్తులోనూ ఇదే తరహా వడ్డీరేట్లను కొనసాగించనున్నట్లు అమెరికా ఫెడరల్ రిజర్వు సభ్యుడి వ్యాఖ్యలు బంగారం ధరలపై ప్రతికూల ప్రభావం చూపాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ వర్గాలు వెల్లడించాయి. దీంతో న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం బంగారం ధర రూ.550 దిగొచ్చి రూ.74,650కి పడిపోయాయి. అంతకుముందు ధర రూ. 75,200గా ఉన్నది. బంగారంతో పాటు వెండి ధరలు భారీగా తగ్గాయి. కిలో వెండి ఏకంగా రూ.1,600 దిగొచ్చి రూ.94,500కి తగ్గింది. అంతర్జాతీయ స్పాట్ గోల్డ్ కోమెక్స్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 22 డాలర్లు తగ్గి 2,420 డాలర్లకు పరిమితమవగా, వెండి 31.60 డాలర్లుగా ఉన్నది.



# ఏపీకే ఫైల్స్‌తో జాగ్రత్త

**ఆన్‌లైన్ మోసాలపై కస్టమర్లను హెచ్చరిస్తున్న బ్యాంకులు**

**అమాయకులే లక్ష్యంగా రెచ్చిపోతున్న కేటుగాళ్లు**

**అనవసరపు మెసేజ్‌లు, లింక్‌లపై క్లిక్‌చేస్తే అంతే సంగతి**

**ఓటీపీలు, అపరిచిత కాల్స్‌కు స్పందించవద్దని సూచనలు**



హైదరాబాద్/ముంబై/న్యూఢిల్లీ, మే 21: నేడు అంతటా డిజిటల్ బ్యాంకింగే. అందరికీ ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రావడంతో స్మార్ట్‌ఫోన్ల ద్వారా ఆన్‌లైన్ లావాదేవీలు జోరుగా సాగుతున్నాయి. అయితే ఇదే.. సైబర్ మోసగాళ్లకు కూడా చేతినిండా పని దొరికేలా చేస్తున్నది. ఖాతాదారుల అమాయకత్వం, ఏమరుపాటే ఈ కేటుగాళ్ల పెట్టుబడి. రోజురోజుకూ సరికొత్త వ్యూహాలతో స్కాములకు తెగబడుతున్నారు. మోసపోయామని బ్యాంకుల వద్దకు పరుగులు పెడుతున్నవారెందరో మనమూ చూస్తూనే ఉన్నాం. దీంతో బ్యాంకర్లు కస్టమర్లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఈ క్రమంలోనే ప్రభుత్వ రంగ బ్యాంకులు ఎస్బీఐ, పీఎన్‌బీతోపాటు.. ప్రైవేట్ రంగ బ్యాంకులు ఐసీఐసీఐ, యాక్సిస్ మరికొన్ని తమతమ ఖాతాదారులకు సూచనలు, సలహాలు అందజేస్తున్నాయి. మొబైల్ ఫోన్లకు వచ్చే అనవసరపు మెసేజ్‌లు, లింక్‌లపై క్లిక్ చేయవద్దని.. ఓటీపీలు, డెబిట్/క్రెడిట్ కార్డు నెంబర్ల పిన్ నెంబర్లు, ఇతరత్రా సమాచారం ఎవరికీ ఇవ్వరాదని కోరుతున్నాయి. ఈ తరహా మెసేజ్‌లు, కాల్స్‌పై దగ్గర్లోని బ్యాంక్ శాఖల్లో ఫిర్యాదు కూడా చేయవచ్చని చెప్తున్నాయి. ఇక గుర్తుతెలియని యాప్‌ల జోలికి వెళ్లరాదని, వాటిని ఇన్‌స్టాల్ చేసుకోవద్దని కూడా సలహా ఇస్తున్నాయి. రివార్డు పాయింట్లతో ఉచ్చులోకి దించాలని చూసిన మోసగాళ్ల ఎత్తును కనిపెట్టి ఇటీవలే ఎస్బీఐ తమ ఖాతాదారులను అప్రమత్తం చేయడం గమనార్హం. మెసేజ్‌లు, ఫోన్ కాల్స్‌తో పని జరుగడం లేదనుకున్న కేటుగాళ్లు.. ఇప్పుడు యాప్‌ల ద్వారా ముందుకెళ్తున్నారు. ఏపీకే ఫైల్స్‌తో తెలియకుండానే మొబైల్ కస్టమర్లను ముంచేస్తున్నారు.

### ఏపీకే మోసం అంటే?

ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజీ (ఏపీకే) ద్వారా సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నట్టు ఎస్బీఐ, ఐసీఐసీఐ, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు తమ ఖాతాదారులను హెచ్చరిస్తున్నాయి. ఆండ్రాయిడ్ ఎకోసిస్టమ్.. తమ యూజర్లు ప్లే స్టోర్ నుంచి థర్డ్ పార్టీ మొబైల్ యాప్స్‌నూ ఇన్‌స్టాల్ చేసుకొనేందుకు అనుమతిస్తుంది. ఈ వెసులుబాటే ఆండ్రాయిడ్ యూజర్లను హ్యాకర్లు దోపిడీ చేసేందుకు కలిసొస్తున్నది. ఏపీకే లేదా ట్రోజనైజింగ్ ద్వారా ఓ చట్టబద్ధమైన యాప్ ఇన్‌స్టాల్ చేసి యూజర్లను బురిడీ కొట్టిస్తున్నారు. దీనిపై ఎస్బీఐ తమ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో 'ఎస్బీఐ రివార్డు పాయింట్లను రిడీమ్ (గెల్చుకోవడం లేదా పొందడం) కోసం వాట్సాప్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా బ్యాంక్ ఖాతాదారులకు మోసగాళ్లు ఏపీకేలు పంపిస్తున్నారు. దయచేసి గుర్తుంచుకోండి ఎస్బీఐ ఎప్పుడూ ఏ లింకులు లేదా ఏపీకేలనూ వాట్సాప్, మెసేజ్‌ల ద్వారా ఖాతాదారులకు పంపించదు. వాటిపై క్లిక్ చేయవద్దు. గుర్తుతెలియని ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవద్దు' అని పోస్ట్ చేసింది.

### మోసపోతాం ఇలా..

1. బ్యాంక్ ఖాతాదారులు తమ స్మార్ట్‌ఫోన్లలో హానికరమైన ఏపీకేలను ఇన్‌స్టాల్ చేసుకోవడం ద్వారా హ్యాకర్ల ఉచ్చులో తొలుత చిక్కుకుంటారు. ఈ ఏపీకేలను ఇన్‌స్టాల్ చేసుకునేలా మోసగాళ్లు రకరకాల ఇంజినీరింగ్ వ్యూహాలనూ అమలు చేస్తూ ఉంటారు.
2. ఏపీకేపై క్లిక్ చేసి ఇన్‌స్టాల్ చేసుకున్నప్పుడు ఇది ప్రమాదం అంటూ ఎన్నో గుర్తుతెలియని సందేశాలు వెంటవెంటనే మొబైల్‌కు వస్తాయి. ఇందులో కెమెరా, మైక్రోఫోన్, లొకేషన్, కాంటాక్ట్స్, ఎస్ఎంఎస్ తదితర అనుమతులు అవసరమని కూడా ఉంటుంది.
3. అన్ని అనుమతులూ ఇస్తూ మొబైల్ వినియోగదారులు ఏపీకేను ఇన్‌స్టాల్ చేసుకుంటే.. హ్యాకర్లు తమ హ్యాకింగ్ డివైజ్‌లపై సదరు మొబైల్‌ఫోన్‌ను గుప్పిట్లోకి తీసుకుంటారు. ఆపై మీ విలువైన, రహస్య సమాచారం వారి చేతుల్లోకి వెళ్లిపోతుంది. క్షణాల్లో మీకు సంబంధించిన అన్ని ఖాతాల నుంచి నగదును మాయం చేసేస్తారు.

### ఇవి గుర్తుంచుకోండి

- ఏపీకే ఫైల్ పరిమాణం కొద్ది కేబీల్లోనే ఉంటుంది. కాబట్టి స్టోరేజీలో ఇది పెద్దగా స్పేస్‌ను తీసుకోదు. దీంతో ఇలాంటి ఒక ఫైల్ మన మొబైల్‌లోకి వచ్చినట్టే మనం గుర్తించలేకపోతాం. అంతేగాక ఇది పైకి కూడా కనిపించదు.
- మీ మొబైల్స్‌లో యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ అయ్యుంటే మాత్రం ఈ ఏపీకే ఫైల్స్ హానికరమైనవని వెంటనే మీరు తెలుసుకోగలరు. అప్పుడు తక్షణమే సదరు ఫైల్స్‌ను డిలేట్ చేయండి.
- గూగుల్ ప్లే స్టోర్ సూచనలను తప్పక పాటించాలి. డౌన్‌లోడ్ చేస్తున్నప్పుడు ఎలాంటి హెచ్చరికలు వచ్చినా ముందుకు వెళ్లకపోవడమే మంచిది.
- మొబైల్ ఫోన్‌ను ఎప్పటికప్పుడు రీబూట్ చేసుకోవాలి. బ్యాక్‌గ్రౌండ్ యాప్స్‌ను డిలేట్ చేయాలి. అప్పుడే హ్యాకర్స్‌కు మీ ఫోన్‌తో ఉన్న కనెక్షన్ తెగిపోతుంది.

## భెల్ ప్రాఫిట్ డౌన్

న్యూఢిల్లీ, మే 21: ప్రభుత్వరంగ విద్యుత్ పరికరాల తయారీ సంస్థ భెల్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.489.62 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.658.02 కోట్లతో పోలిస్తే 25 శాతం తగ్గింది. నిర్వహణ ఖర్చులు పెరగడం వల్లనే లాభాల్లో గండిపడిందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. నిర్వహణ ఖర్చులు రూ.7,411.64 కోట్ల నుంచి రూ.7,794.11 కోట్లకు పెరిగాయని తెలిపింది. కంపెనీ ఆదాయం రూ.8,416.84 కోట్లకు పెరిగినట్లు వెల్లడించింది. మరోవైపు, రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు 25 పైసల డివిడెండ్‌ను ప్రకటించింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.24,439.05 కోట్ల ఆదాయంపై రూ.282.22 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది.

## సీపీఎస్‌ఈ డివిడెండ్ రూ.53,000 కోట్లు!

న్యూఢిల్లీ, మే 21: కేంద్రంలో కొలువుదీరే కొత్త ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను జూలై బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (సీపీఎస్‌ఈ)ల నుంచి మరింత డివిడెండ్లను ఆశించబోతున్నది. ఫిబ్రవరి 1న ప్రకటించిన మధ్యంతర బడ్జెట్‌లో ఆర్థికేతర సీపీఎస్‌ఈల నుంచి రూ.48,000 కోట్లుగా డివిడెండ్లను అంచనా వేశారు. అయితే ఈ డివిడెండ్ల లక్ష్యాన్ని ఆర్థిక మంత్రిత్వ శాఖ మరో రూ.5,000 కోట్లు పెంచి రాబోయే బడ్జెట్‌లో దాదాపు రూ.53,000 కోట్లుగా చేయవచ్చని సంబంధిత ఉన్నతాధికారి ఒకరు చెప్తున్నారు.



## కోటి దాటిన విమాన ప్రయాణికులు

● **ఏప్రిల్ నెలలో 4 శాతం పెరుగుదల**

న్యూఢిల్లీ, మే 21: దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగారు. ఏప్రిల్ నెలకుగాను ప్రయాణికులు 3.88 శాతం ఎగబాకి 1.32 కోట్లకు చేరుకున్నట్లు పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్(డీజీసీ) తాజాగా వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే నెలలో 1.28 కోట్ల మంది ప్రయాణించారు. 1,370 మంది ప్రయాణికులు బోర్డింగ్ రద్దు కావడంతో పరిహారం కింద వీరికి విమానయాన సంస్థలు రూ.1.36 కోట్లు చెల్లింపులు జరిపాయి. గత నెలలో 32,314 విమాన సర్వీసులు రద్దయ్యాయి. దీంతో పరిహారం, ఇతర కింద రూ.89.26 లక్షలు చెల్లింపులు జరిపాయి. 1,09,910 విమాన సర్వీసులు ఆలస్యంగా నడిచాయి. సరైన సమయానికి విమాన సర్వీసులు నడిపే సంస్థల్లో ఆకాశ ఎయిర్ 89.2 శాతంతో తొలి స్థానంలో నిలిచింది. ఆ తర్వాతి క్రమంలో ఏఐఎక్స్ కనెక్ట్(79.5 శాతం), విస్తారా (76.2 శాతం), ఇండిగో(76.1 శాతం), ఎయిర్ ఇండియా (72.1 శాతం), స్పైస్‌జెట్(64.2 శాతం), అలయెన్స్ ఎయిర్(49.5 శాతం)తో ఉన్నాయి. ఇండిగో మార్కెట్ వాటా స్వల్పంగా పెరిగి 60.6 శాతానికి చేరుకున్నది. కానీ, టాటా గ్రూపు ఆధ్వర్యంలో నడుస్తున్న ఎయిర్ ఇండియా మార్కెట్ వాటా పెరగగా, విస్తారా, ఏఐఎక్స్ కనెక్ట్ మార్కెట్ వాటా తగ్గుముఖం పట్టింది.





## ఎంఫసిస్ గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సెంటర్

హైదరాబాద్, మే 21: ఐటీ సొల్యూషన్ సేవల సంస్థ ఎంఫసిస్..తాజాగా హైదరాబాద్‌లో గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(జీసీవో)ని ప్రారంభించింది. అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ సేవలైన కృత్రిమ మేధస్సు, జెన్-ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్‌లో అంతర్జాతీయ క్లయింట్లకు సేవలు అందించడానికి ఈ సెంటర్‌ను నెలకొల్పినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ నూతన సెంటర్‌ను ఇన్నోవేషన్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు, ఇందు కోసం ప్రాంతీయంగా ఉండే ప్రతిభ కలిగిన వారిని రిక్రూట్ చేసుకోనున్నట్లు ప్రకటించింది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్, లాజిస్టిక్స్, రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన అంతర్జాతీయ సంస్థలకు సేవలు అందించనున్నది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.